# తొలి ప్రేమ ★

రచన :
శ్రీ బచ్చు వీర్రాజు

ఈ మధ్యనే 'గోవిందా ప్రొడక్షన్స్' అనే సంస్థ కొత్తగా వెలిసింది. దాని అధినేత వెల్లుల్లి గోవిందయ్య. వ్యాపారంమీద లక్షలకు లక్షలు గడించి, కోట్లు గడించాలనే తపనతో సినిమారంగం మీదకి వచ్చి పడ్డాడు.

వెంటనే 'గోవిందా ప్రొడక్షన్స్' ప్రారంభించి, తాను తీసే సినిమాలోకి కొత్త నటీనటులు కావాలని, పత్రికలలో ఓ బ్రహ్మాండమైన ప్రకటన యిచ్చాడు.

ఆ ప్రకటన వెలువడిన మూడు రోజులకే, సినిమా పిచ్చోళ్ళనుంచీ, పిచ్చమ్మలనుంచీ పుంఖానుపుంఖంగా దరఖాస్తులూ, ఫోటోలూ వచ్చి పడిపోయి, ఆఫీస్ గదిని నింపిపడేశాయి.

• • •

ఓ మంచి రోజున 'ఇంటర్వ్యూ' మొదలైంది. వచ్చిన వాళ్ళల్లో ఓ యిరవైమంది నటీనటుల్ని ఎన్నిక చెయ్యడం జరిగింది.

హీరోగా, చక్కటి ఆకర్షణీయమైన ముఖం గల 'రాజు' అనే యువకుడు సెలెక్ట్ కాబడితే, హీరోయిన్‌గా అందాలబొమ్మ 'వాణి' ఎన్నుకోబడింది. ఆ యిద్దర్నీ చూస్తూంటే రతీమన్మథులు శాపవశాత్తూ భూలోకంలో అవతరించారేమో ననిపించింది అందరికీ.

నూతన నటీనటు లందరికీ అడ్వాన్సు లిస్తూ, అగ్రిమెంట్ వ్యవహారాలన్నీ పూర్తిచేశారు.

• • •

గోవిందయ్య తను తీసే చిత్రం పేరు 'తొలి ప్రేమ' అనీ, అందులో నటించే తారలందరి పేర్లు, ఫోటోలూ వాళ్ళ పూర్తి వివరాలతో, అన్ని దినపత్రికలలోనూ మరో బ్రహ్మాండమైన ప్రకటన చేస్తూ, షూటింగ్ తేదీకూడా తెలియజేశాడు.

నటీనటు లందరికీ, డైలాగ్సు పలకరించడంలోనూ, ఫీలింగ్సు విషయంలోనూ ఓ సమర్థుడైన దర్శకునిచే శిక్షణ ఇవ్వడం మొదలైంది.

షూటింగు ఇంకా మూడు రోజులుండగా, నటీనటు లందరినీ బాగా రెస్ట్ తీసుకోమని సెలవు ప్రకటించారు గోవిందయ్య.

నటీనటులంతా ఒక్కసారిగా ఊపిరి పీల్చుకొని, హుషారుగా బయటికి దారితీశారంతా.

• • •

ఆ రోజే 'తొలిప్రేమ' షూటింగు ప్రారంభించే రోజు. డైరెక్టరు, ప్రొడక్షన్ మేనేజరు, కెమేరామెన్ వగైరా లంతా చాలా బిజీగా వున్నారు.

నటీనటు లంతా వచ్చారుగానీ, యింకా హీరో, హీరోయిన్సు మాత్రం రాలేదు.

చిత్రసీమలోని ప్రముఖులూ, కొంతమంది రాజకీయవేత్తలూ, వ్యాపారదక్షులు కూడా విచ్చేయడంతో, స్టూడియో కళ కళ లాడటం మొదలెట్టింది,

హీరో, హీరోయిన్సు ఇంకా రాకపోవడంతో గోవిందయ్య కంగారుపడి వెంటనే ప్రొడక్షన్ మేనేజర్‌ని పంపించాడు.

మిగతా నటీనటులంతా మేకప్ రూమ్‌లోకి చొరబడ్డారు. మేకప్ మొదలైంది. ఓ ఫ్లోర్‌లో సెట్ తయారైంది. లైటింగు పరికరాలు చక్కగా అమర్చబడ్డాయి. కెమేరా సిద్ధంగా వుంది.

ఇంతలో ప్రొడక్షన్ మేనేజర్, రొప్పుతూ,

మాలుగుతూ గబగబా ఓ రెండు వుత్తరాలను తీసుకువచ్చి గోవిందయ్య చేతిలో వుంచాడు.

గోవిందయ్య కంగారుపడిపోతూ, ఆ లెటర్ల నందులోని ఒక లెటర్ తీసి చూశాడు.

◆ ◆ ◆

అందులో...

శ్రీ గోవిందయ్యగారికి—

ఓ లక్షాధికారి కొడుకునైన నేను, నా అందానికి తగ్గ అపురూప సౌందర్యవతిని చేపట్టాలనే వుద్దేశ్యంతో, యింతవరకూ నేను పెళ్ళి చేసుకోకుండా వుండిపోయాను. ఇన్నాళ్ళకు నా కోరిక హీరోయిన్ వాణి ద్వారా నెరవేరింది. మేమిద్దరం నిన్ననే రిజిష్టర్ మ్యారేజ్ చేసుకొన్నాం. ఈ రోజే హనిమూన్‌కు కాశ్మీరు వెళ్ళిపోతూ ఈ లెటర్ వ్రాస్తున్నాను—మీకు నష్టం లేకుండా మీ అడ్వాన్సునూ, ఓ లక్ష రూపాయలకు చెక్కునూ త్వరలో పంపిస్తాను. మీ సంస్థ ద్వారా నాకు చక్కని దేవకన్య లాంటి యిల్లాలు దొరికినందుకు మీకు సదా కృతజ్ఞుణ్ణి.

సెలవు

'రాజా'

గోవిందయ్య వెంటనే మరో లెటర్ తీశాడు.

అందులో...

శ్రీ గోవిందయ్యగారికి—

అందంతోపాటు, లక్షలాస్థిగల యువకుణ్ణి పొందాలనుకొనే నా గాఢమైన కోరిక మీ ద్వారా నెరవేరినందుకు మీకు కృతజ్ఞురాలిని.

సెలవు

శ్రీమతి వాణీరాజా.

అంతే! గోవిందయ్య ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. అక్కడ ఆహూతులైన వాళ్ళందరికీ మతులుపోయాయి.

"కవిరత్న" జానపద కవిసార్వభౌమ

# శ్రీ కొసరాజు

సాహితీ షష్ట్యబ్ది మహోత్సవం!

ప్రొద్దటూరు సాహితీ మిత్రమండలి వారు ఆంధ్రప్రదేశ్ రహదారులు, భవనాల శాఖామాత్యులైన గౌ॥ దివి కొండయ్య చౌదరిగారి అధ్యక్షతలో శ్రీ కొసరాజుకు 'సాహితీ షష్ట్యబ్ది మహోత్సవం'ను ఈ నెల రెండవ తేదీన మద్రాసు హబిబుల్లా రోడ్‌లో వుండే స్వామి శంకరదాస్ ఆడిటోరియంలో అతి వైభవోపేతంగా జరిపించారు.

ఆ రోజు సాయంత్రం 5-50 గంటలకు సుప్రసిద్ధ చలనచిత్ర నిర్మాత, సహజ కవి అయిన శ్రీ ఎం. ఎస్. రెడ్డిగారి భవనంనుంచి శ్రీ కొసరాజుగారిని అలంకృతమైన కారులో, బ్రహ్మాండమైన ఊరేగింపుతో సన్మాన సభకు పిలుచుకుని వచ్చారు.

సరిగ్గా 6-30 గంటలకు ప్రారంభమయిన సన్మాన సభలో శ్రీయుతులు టి. రామప్రసాద్ గారు (రిటైర్డ్ ఛీఫ్ జస్టిస్) ఎన్.టి. రామారావు గారు, ఎం.ఎస్. రెడ్డిగారు, సి.వి.ఎస్. రాజుగారు, కె. జగ్గయ్యగారు, కొండవీటి వెంకటకవి, సి. సి. సుబ్బరాయుడు, వై. జానకిరావు, శ్రీమతి షావుకారు జానకి మొదలగువారు శ్రీ కొసరాజుగారి 60 సంవత్సరాల సాహితీ సేవను కొనియాడి, ఇంకనూ దీర్ఘకాల సాహితీసేవ చేయాలని, భగవంతుడు, వారికి పూర్ణాయురారోగ్యములను ప్రసాదించాలని ప్రార్థించారు.

కళాప్రపూర్ణ శ్రీ ఎస్. రాజేశ్వరరావుగారు తన బృందంతో జరిపిన సంగీత విభావరినంతరం సన్మాన సభ పూర్తయింది.